క్లుప్తంగా

ఘనంగా ముగిసిన శ్రీరామ నవమి వేడుకలు



పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీలేరు: శ్రీరామనవమి పురస్కరించుకొని సీలేరు కోదండ రామాలయంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గణపతిపూజ, సీతారామ లక్ష్మణ హనుమాన్‌లకు మండపారాధన, రాముల వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం పట్టాభిషేకము జరిపారు. గ్రామంలో ఉన్న మహిళలచే కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతమ్మ వారి సారె ఊరేగించి, పుష్పయాగం నిర్వహించారు.అనంతరం స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమాలు జరిపినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలల్లో తనిఖీలు



జగ్గంపాలెంలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం : మండలంలోని వివిధ పాఠశాలలను ఎంఈవో వై.మల్లేశ్వరరావు గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని జగ్గంపాలెం, ఓజుబంద, ఎంపీపీ పాఠశాలలు, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫేస్ -2 పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి



జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్

సీలేరు: దండకారణ్య విమోచన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిల్లో మనోజ్ కుమార్ ఎన్నికయ్యారు.ఈ సమితి నాయకులు డాక్టర్ కేశవరావు, బీఎస్ఎన్ పడాల్, దండకారుణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమిరెడ్డి మాణిక్యం సమక్షంలో గురువారం జరిగిన ఎన్నికల్లో సీలేరుకు చెందిన కిల్లో మనోజ్ కుమార్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసులకు సరైన విద్య, ఉపాధి లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారన్నారు. సరైన వైద్యం అందక ఆదీవాసీలు మరణిస్తున్నారన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఎంపీడీవోకు ఉపాధి సిబ్బంది వినతి



ఎంపీడీవో బాపన్నదొరకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉపాధి సిబ్బంది

వై.రామవరం: మండల ఉపాధి హామీ సిబ్బంది ఏపీవో సాయిబాబ ఆధ్వర్యంలో గురువారం తమ సమస్యల పరిష్కారం కోసం పాడేరులో ర్యాలీ నిర్వహణ ద్వారా నిరసన తెలియజేయడం కోసం ఎంపీడీవో కె.బాపన్నదొరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న పాడేరులో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వాలు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఏపీవోతో పాటు టెక్నికల్, ఫీల్డు అసిస్టెంటులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



చిన్నారుల కోలాట ప్రదర్శన

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని కోదండరామస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకొంది. స్థానిక నూకాంబికా కోలాట బృందం చిన్నారులు జానపద పాటలకు అనుగుణంగా కోలాటమాడి అందరి మన్ననలు పొందారు. శ్రీరామనవమి సందర్భంగా జరుగుతున్న వేడుకల్లో ఈ ప్రదర్శన జరిగింది. శిక్షకులు పైడా లక్ష్మి, కుమారి, గుప్తా, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వెతలు తీరేనా?



క్వార్టర్స్ దుస్థితి



వై.రామవరంలో సీహెచ్‌సీ సిబ్బంది క్వార్టర్స్ కాలనీ



వై.రామవరం సీహెచ్‌సీ

శిథిలావస్థలో వైద్యులు, సిబ్బంది క్వార్టర్స్

బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబ్

ఆందోళనలో కాలనీవాసులు

పట్టించుకోని అధికారులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో నిర్విరామంగా సేవలు అందిస్తున్న వైద్యాధికారులు సిబ్బందికి నివాస గృహాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 8 మంది వైద్యాధికారులు, 48 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రోజుకు సుమారు 70 వరకు ఓపీ నమోదవుతుంది. ఇక్కడ 30 పడకల ఆస్పత్రి అయినప్పటికీ, రోజూ 40 మందికి పైగా రోగులు ఇన్‌పేషెంటు వార్డులో చేరుతుంటారు. ఆస్పత్రిలో పడకలు సరిపోగా ఒక్కో బెడ్‌పైన ఇద్దరేసి రోగులు పడుకుంటున్నారు. ఇక్కడి సీహెచ్‌సీకి కొయ్యూరు, అడ్డతీగల తదితర మండలాల నుంచి ఎంతోమంది రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. నిర్విరామంగా సేవలు అందిస్తున్న సిబ్బందికి నివాసం ఉండడానికి నీడలేక పోవడం దురదృష్టకరమని పలువురు చెబుతున్నారు. ఆస్పత్రిలో బాధ్యతగా పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బందికి నిలువ నీడ లేకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిల భవనాల్లోనే నివాసం

ప్రస్తుతం కొంతమంది ఆస్పత్రి సిబ్బంది శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటున్నారు. ఆ భవనాలు పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెంతున్నారు. వర్షాకాలంలో గదులన్నీ వర్షపునీటితో నిండిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. మండల కేంద్రంలో అన్ని సదుపాయాలున్న అద్దె గృహాలు అందుబాటులో లేక శిథిలావస్థలోని క్వార్టర్స్‌లో ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిల గృహాల్లో బిక్కుబిక్కుమంటూ నివాసముంటున్నామని చెబుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



ఆస్పత్రి సిబ్బంది నివాస గృహాల నిర్మాణం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమతో పాటు వైద్యాధికారులు, సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తు, రోగులకు సేవలు అందిస్తు ఆస్పత్రికి మంచి పేరు తెచ్చాం. మరోసారి సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– డాక్టర్ రాహుల్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, వై.రామవరం

యంత్రాంగం స్పందించాలి



నిర్విరామంగా సేవలు అందిస్తున్న వైద్యాధికారులు, సిబ్బందికి నివాస గృహాలు లేకపోవడం దారుణం. వారంతా రోగులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. యంత్రాంగం స్పందించి నివాస గృహాలు, నిర్మించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– వీరమళ్ల సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ, వై.రామవరం

ముత్యాలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు



చింతపల్లి బస్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్

చింతపల్లి: మండల కేంద్రంలోని నిర్వహించనున్న ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ జాతరను ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో విద్యుత్‌దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్ట కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే జెయింట్ వీల్ ఏర్పాట్లను చింతపల్లి బస్ కాంప్లెక్సు ఆవరణలో ప్రారంభించారు.

రేపటి నుంచి భీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ ఉక్కుర్బ గ్రామంలో 12,13,14 తేదీల్లో భీమలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లకె చిట్టిబాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. మూడు రోజులు నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రోజూ ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆది, సోమవారాల్లో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మామిడిపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ నూకరత్నం

చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ భీమసింగి సెక్టార్ మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వనగల సోమరత్నం మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా రోజూ వారీ ఆహారంలో పౌష్టిక పదార్థాలున్నట్టు చూసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గోపినాయక్ శారద, సీడీపీవో జి.వి.రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, గౌహర్‌ఉన్నీష, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి తదతరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అవసరం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని రంగబయలు పంచాయతీలోని మట్టిగూడ, చంపాపుట్టు, వలజంగి ప్రభుత్వ పాఠశాలలను ఆయను గురువారం సందర్శించారు. వార్షిక పరీక్షల నిర్వహణను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా అమలు చేస్తూ నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని ఆయన ఉపాధ్యాయులకు ఎంఈవో కృష్ణమూర్తి సూచించారు. సీఆర్‌పీ భాస్కర్‌రావు, ఉపాధ్యాయులున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



కొయ్యూరులో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు



చింతపల్లిలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ మోహనరావు

కొయ్యూరు: మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 35 యూనిట్లు మంజూరయ్యాయని, 228 దరఖాస్తు చేసుకోగా, 168 ఇంటర్వ్యూలకు హాజరైనట్టు చెప్పారు. గ్రామీణ వికాస బ్యాంకు, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

చింతూరు: బీసీ, ఓసీ కార్పొరేషన్ రుణాల మంజూరు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల నిమిత్తం మండల వ్యాప్తంగా 116 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 97 మంది హాజరయ్యారు. ఈవోఆర్డీ మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఈ రుణాలను నిరుద్యోలు సద్వినియోగం చేసుకోవాలని, రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. వివిధ బ్యాంకుల మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

వేతన బకాయిలు చెల్లించాలి



సమావేశమైన మండల పీసా కమిటీ సభ్యులు

జి.మాడుగుల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024 సంవత్సరం అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు తక్షణమే చెల్లించేందుకు అధికారులు దృష్టి సారించాలని పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ తెలిపారు.

మండలంలోని 17 పంచాయతీలకు చెందిన పీసా కమిటీ ఉపాధ్యక్షుల సమావేశం గురువారం జి.మాడుగులలో జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జీవించే గిరిజనులు ఎటువంటి ప్రలోభాలకు లోబడకుండా గిరిజనేతరుల నుంచి భూములను కాపాడుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ పరిధిలో జరిగే లబ్ధిదారుల ఎంపిక, పథకాలు, సర్పంచ్‌లు పెసా సభ్యులకు ముందుగా తెలియపరిచి హాజరయ్యే విధంగా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని పెసా కమిటీ ఉపాధ్యక్షులు అందజేశారు.

గూడెంకొత్తవీధి: సచివాలయాల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్రలకు ఐదునెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో తామంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. తక్షణమే తమకు బకాయి వేతనాలను మంజూరు చేయాలని పలువురు క్లాప్‌మిత్రలు కోరారు.

కనులపండువగా అమ్మవారి మాలధారణ

సీలేరు: సీలేరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారి మాలధారణ ఘనంగా ప్రారంభమైంది. సుమారు 50 మంది అమ్మవారి భక్తులు మాలధారణ స్వీకరించారు. ఏటా ఏప్రిల్ 14న అమ్మవారి జాతర జెండా అవిష్కరణతో పండుగ ప్రారంభం కానుంది. దీంతో మొక్కులు తీర్చుకునే భక్తులు అమ్మవారి మాల ధరించి ఈ నెల 15న భారీ ఎత్తున జరిగే అగ్నిగుండం మీదుగా గరగాలయ ప్రవేశం చేపడతారని ఆలయ అర్చకులు దామోదర్ తెలిపారు. ఇందులో భాగంగా 9 రోజులు కఠిన నియమాలను అనుసరించి మాలలు ధరిస్తారని, అమ్మవారి ప్రధాన పండుగ ముగించుకొని మరుపూజ వరకు ఈ మాలలు ధరిస్తారని పేర్కొన్నారు. అమ్మవారి ప్రధాన పండుగ ఈ నెల 27న నిర్వహించనున్నట్టు తెలిపారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చెరుకుంపాకలలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిన్నయ్యపడాల్

చింతపల్లి: భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో గల చెరుకునంపాకలు గ్రామంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రతి నెల సక్రమంగా బిల్లులు కూడా చెల్లించడం లేదన్నారు. ఈ సమస్యలపై మే రెండో వారంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నాయకులు లక్ష్మి, జ్యోతి, శాంతి, చెల్లమ్మ, సత్యవతి, కుమారి తదతరులు పాల్గొన్నారు.

మినీ గోకులంతో రైతులకు ఆర్థికాభివృద్ధి



షెడ్డును ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ రాజరవికుమార్, ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ గొండికోడాపుట్టు గ్రామంలో ఉపాధి పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులం షెడ్డును పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాజ రవికుమార్, ఎంపీడివో ఎల్.పూర్ణయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ గోకులం పథకం ద్వారా పాడి పశువుల అభివృద్ధి సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారన్నారు. ఏడీ రాజ రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాడి పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.2.23లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. మండలంలో 30 మినీ గోకులం యూనిట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పూర్తయిందన్నారు. పది నుంచి 15 పశువులు షెడ్డులో ఉండడానికి వీలు కలుగుతుందన్నారు. పాడి పశువులు పెంపకంపై గిరిజన రైతులు ఆశక్తి పెంచుకోవాలన్నారు. స్థానిక పశువైద్యాధికారి సౌజన్యదేవి, ఉపాధి ఏపీవో అప్పలనాయుడు, పశువైద్య సిబ్బంది. మాజీ ఎంపీటిసి కృష్ణారావు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ విజయబాబుకు పరామర్శ



జెడ్పీటీసీ గుజ్జాబాబు దంపతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: మండలంలోని జగ్గవరం గ్రామంలో జెడ్పీటీసీ గుజ్జా విజయబాబు దంపతులను ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు గురువారం పరామర్శించారు. గుజ్జా బాబు తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పలు విషయాలపై చర్చించారు. మండల పార్టీ కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆవుల మరియాదాస్, దీకొండ గంగాధర్, భరతమూర్తి, నోముల కొండలరావు, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, కొమ్మాని సునీత, ఎస్.సత్యనారాయణ, పండు, కె.మోహన్‌రావు, వీరాజు, హరనాథ్, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



వై.రామవరంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు, వేసవి సందర్భంగా తాగునీటి సమస్యలపైన దృష్టి సారించాలని సచివాలయాల సిబ్బందికి ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందితో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని దుకాణాలలోను విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పక్కాగా నిషేధించాలని సూచించారు. ప్రతీ గ్రామంలోను తాగునీటి సమస్యలపై సర్వే నిర్వహించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సచివాలయాల ద్వారా అన్నిరకాల సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని సూచించారు. మెరుగైన సేవలు అందించే విధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు

అడ్డతీగల: గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్ చెప్పారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో గురువారం సుమారు 63 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆస్పత్రుల్లో జరిగే వైద్య సేవలపై మహిళల్లో అవగాహన పెంచాలన్నారు. గర్భిణులకు తలెత్తే వివిధ రకాల సమస్యలు, పాటించవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఆస్పత్రి కౌన్సిలర్ నార్నె వాసు తెలిపారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గైనకాలజిస్టు యర్రా వెంకటరమణారావు గర్భిణులకు వివిధ రకాల పరీక్షలను చేశారు.

18 నుంచి మోదమ్మ తల్లి ఉత్సవాలు



విరాళాల పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

పెదబయలు: గిరిజనుల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు మే 18 నుంచి 20 తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కిమంకరి బొంజుబాబు ,తలారి చక్రధర్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన విరాళాల పుస్తకాలను అమ్మవారి ఆలయంలో అమ్మవారి పాదాల చెంతన ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మూడురోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు కమిటీ, ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సర్పంచ్ పలాసి మాధవరావు, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, బొండా సన్నిబాబు, గూబరి రాధాకృష్ణ, శశిధర్, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్



ఎంపీడీవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలో ప్రసుత్తం ఉన్న 18 గ్రామ సచివాలయాలను యధావిధిగా కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాథ్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తిని వారు గురువారం కలిశారు. ఈ మేరకు గ్రామ సచివాలయాలు కొనసాగించాలని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ పరిపాలన అందుబాటులో ఉండేలా మండలంలో 18 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. అయితే ,ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో 9 గ్రామ సచివాలయాలుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, దీనిని వ్యతిరేకిస్తున్నామన్నారు. 23 పంచాయతీల్లో 375 గ్రామాలకు 50వేల జనాభాలకు అనుగుణంగా ప్రస్తుతం సచివాయాలు ఉన్నాయని, వాటిని కుదించి ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ప్రజలకు దూరభారం, ప్రభుత్వ సేవలు దూరమవుతాయని, తక్షణమే ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో సచివాలయాల పరిధిలోని ప్రజలతో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. నేతలు నర్సింగ్రావుపడాల్, భీమరాజు పాల్గొన్నారు.